క్లుప్తంగా

గంగమ్మకు వెండి ఖడ్గం సమర్పణ



గంగమ్మతల్లికి వెండి ఖడ్గం సమర్పించిన భక్తులు

యానాం: యానాం బైపాస్ బాలయోగి వారధి సమీపంలో సూర్యనగర్‌లో కొలువైన దొడ్డి గంగమ్మతల్లికి పలువురు భక్తులు ఆదివారం వెండి ఖడ్గం సమర్పించారు. కనకాలపేట గ్రామానికి చెందిన అడబాల మల్లికార్జునరావు, గాలిదేవర చైతన్య, కరణం ప్రవీణ్ కుమార్, భర్తు వీరవెంకట సత్యనారాయణ, గోవిందు, మధుసూదన్ రెడ్డి, ద్రోణవల్లి శ్రీనివాసరావు మిత్ర బృందం సుమారు రూ.లక్ష వెండితో అమ్మవారికి ఖడ్గాన్ని తయారుచేసి అలంకరించారు. విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కోన దేవ, ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు, యువతీ యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా గోవమ్మ తల్లి వసంతోత్సవం

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ బాబానగర్ సమీపాన ఉన్న గోవమ్మ తల్లి వసంతోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయం వద్ద పచ్చని పందిరి వేసి పూజలు చేశారు. చిన్నారులకు ఆటలు, పాటలు నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులు సందడి చేశారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవు గ్రామదేవత పరదేశమ్మ అమ్మవారి జాతరలో భాగంగా ఆదివారం రోళ్లవారి వీధిలో ఉన్న కొండిశెట్టి ఈశ్వరరావు గృహంలో అమ్మవారికి పానుపు సమర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

నేడు తాళ్లరేవులో సంఘం శరణం గచ్ఛామి కళారూపం

తాళ్లరేవు: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ జీవితం, ఆశయాలు, లక్ష్యాలపై హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ రూపొందించిన సంఘం శరణం గచ్ఛామి కళారూపాన్ని సోమవారం తాళ్లరేవులో ప్రదర్శించనున్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాయంత్రం ఆరు గంటలకు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, మహిళా సంఘాలు, కేవీపీఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని ఆయా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

17న పెదవలసల ఎస్‌ఎంసీ ఎన్నిక

తాళ్లరేవు: ఇటీవల నిర్వహించిన ఎస్‌ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికల సందర్భంగా నిలిచిపోయిన గాడిమొగ పంచాయతీ పెదవలసల ప్రాథమిక పాఠశాల కమిటీ ఎన్నిక ఈ నెల 17న నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.మంగాయమ్మ తెలిపారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి నుంచి ఆదేశాలు వచ్చాయని మంగాయమ్మ తెలియజేశారు. దీనికి సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్, ఓటర్ల జాబితా పాఠశాల హెచ్‌ఎం జి.విజయకుమారితో కలసి ప్రదర్శన చేయడం జరిగిందన్నారు. ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12వ తేదీ లోపు హెచ్‌ఎంకు తెలియజేయాలని కోరారు.

అప్పాజీకి ఇండియన్ ఐకాన్ అవార్డు



అప్పాజీకి అవార్డు ప్రదానం చేస్తున్న మంత్రి దుర్గేష్

అమలాపురం రూరల్: మండలంలోని ఇందుపల్లి చెందిన సమాజ సేవకుడు చొల్లంగి అప్పాజీ పేదలకు చేసిన సేవలను గుర్తించి రాజమహేంద్రవరం ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఇండియన్ ఐకాన్-2024 అవార్డు అందించారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం ధర్మంచర కమ్యూనిటీ హాలులో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో అప్పాజీకి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేశారు. అప్పాజీ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ఉన్నత పదవులు నిర్వహించాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజయోనా, ప్రముఖ కవి కత్తిమండ ప్రతాప్, నర్సిపల్లి హారిక, గుబ్బల రాంబాబు, ఆశ్రిత తదితరులు అప్పాజీని అభినందించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారన్నారు.

నామినేటెడ్ పదవుల కోసం సిగపట్లు

- అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో కూటమి నేతల పైరవీలు
- రెండు పార్టీల నేతలు ఫలానా పదవి తమకేనని ధీమా
- మధ్యలో బీజేపీ నేతలు కూడా ప్రయత్నాలు



నామినేటెడ్ పదవుల కోసం ఊరిస్తున్న అమలాపురం వెంకటేశ్వరస్వామి దేవస్థానం

అమలాపురం టౌన్: అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకుని ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఫలానా పదవి తమదేనంటూ కొందరు కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తూ బల ప్రదర్శనలకు దిగుతున్నారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు టీడీపీ నుంచి ఎన్నిక కావడంతో తమను అంతగా పట్టించుకోవడం లేదన్న వాదన జనసేన పార్టీ నేతలు నుంచి కొన్నిచోట్ల అప్పుడే అసంతృప్తులు మొదలయ్యాయి. అల్లవరం మండలం గోడితిప్ప జనసేన సర్పంచ్ తమకు టీడీపీ నేతలు సరైన గుర్తింపు ఇవ్వడం లేదని రాజీనామాకు సిద్ధపడటాన్ని ఓ ఉదాహరణగా చెప్పవచ్చు. ఇదే క్రమంలో నామినేటెడ్ పదవులు కూడా వారి మధ్య కొంత ఆజ్యం పోస్తున్నాయి. ఇదే చాప కింద నీరులా ఇరు పార్టీల నేతల మధ్య సిగపట్లు అనివార్యమై కాస్త దూరాన్ని కూడా పెంచుతున్నాయి. అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ గిరీ కోసం అటు టీడీపీ, ఇటు జనసేనే నాయకులు ఆశలు పెంచుకుని ఆ పదవి కచ్చితంగా తమ పార్టీనే వరిస్తుందని ఇరు పార్టీల నాయకలు ధీమా వ్యక్తం చేయడం గమనార్హం. ఇరు పార్టీల నుంచి ఈ పదవి కోసం ఆరుగురు నాయకులు పోటీ పడుతున్నారు. జనసేన పార్టీకి చెందిన ఇద్దరు నాయకులైతే బల ప్రదర్శన మాదిరిగా తమ వర్గీయులు వెంటేసుకుని ఎమ్మెల్యేను కలిసి బల నిరూపణ చేసుకున్నారు. అలాగే అమలాపురం వెంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గ చైర్మన్ పదవి కోసం టీడీపీ, జనసేన నాయకుల మధ్య పోటీ నెలకొంది. అలాగే అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పదవి కోసం కూడా అటు టీడీపీ నుంచి ఇటు బీజేపీ నుంచి నేతలు తీవ్ర పోటీ ఇచ్చుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే మాత్రం ఓ టీడీపీ నాయకునికి ఈ మేరకు సిఫారసు లెటర్ కూడా ఇచ్చేసి ఆయనకు ఆ పదవి అన్నట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో బీజేపీ నాయకుడు కూడా అటు ఎంపీని, ఇటు ఎమ్మెల్యేని కలసి వినతి పత్రాలు అందించారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి తాము విశేష కృషి చేశామన్న మాటలు అటు జనసేన, ఇటు బీజేపీ నేతల నుంచి రెండు నియోజకవర్గాల నుంచి బాహాటంగా వినిపిస్తున్నాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలో మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి దేవస్థానానికి కూడా ఇదే తరహాలో టీడీపీ, జనసేన నుంచి పోటీ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం కూడా ఇదే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. ఇక రెండు నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో ఉన్న దేవదాయ శాఖ అధీనంతో ఉన్న దేవస్థానాల ధర్మకర్తల మండళ్లకు కూడా టీడీపీ, జనసేన స్థానిక నాయకుల నుంచి పోటీ ఎక్కువగా ఉంది. రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లుగా కొందరు ఆశిస్తుంటే మరి కొంత మంది ద్వితీయ శ్రేణి నేతలు ఏకంగా ఏదైనా కార్పొరేషన్ చైర్మన్ పదవులకే గేలం వేసి పైరవీలు చేస్తున్నారు. అమలాపురానికి చెందిన ఓ టీడీపీ నాయకునికి జిల్లా మంత్రి రాష్ట్ర స్థాయి పదవి ఇప్పించేందుకు అమరావతి స్థాయిలో కృషి చేస్తున్నారు. ఈ పరిణామం జనసేనలో ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి తీవ్రంగా కృషి చేసిన జనసేన నేతల్లో కొందరు మా సంగతేంటి...? అని ఇద్దరి ఎమ్మెల్యేలను ప్రశ్నిస్తున్నారు. రెండు నియోజకర్గాల ఎమ్మెల్యేలు ఎవరికి ఏ పదవి ఇస్తే ఏ పార్టీ నుంచి నిరసన ఎదుర్కోవలసి వస్తోందనన్న లోలోన ఆందోళన అలుముకుంది. రెండు నియోజకవర్గాల్లో నెగ్గింది టీడీపీ ఎమ్మెల్యేలే కాబట్టి తమ పార్టీ నేతలకే ఎక్కువగా నామినేటెడ్ పదవులు కట్టబెట్టాలన్న ఆకాంక్షలు ఉన్నప్పటికీ తీరా పదవులు ఇచ్చాక జనసేన నుంచి ఎలాంటి అసంతృప్తులు ఎదుర్కోవలసి వస్తుందోనన్న బెదురు కూడా ఎమ్మెల్యేలను వెంటాడుతోంది. అటు టీడీపీ ఎమ్మెల్యేలు, ఆ పార్టీ ముఖ్య నేతలు తమను పట్టించుకోవడం లేదని, అధికార కార్యక్రమాలకు సరైన సమాచారం ఇవ్వడం లేదన్న వాదన కూటమి ప్రభుత్వానికి రెండు నెలల కాలం నిండే సరికే జనసేన నేతల నుంచి వినిపిస్తోంది. దీనికి తోడు నామినేటెడ్ పదవులు విషయంలో కూడా తమకు మొండి చేయి చూపించే పరిస్థితి కనిపిస్తోందని జనసేన నాయకుల్లో అంతర్లీనంగా అప్పుడే అసంతృప్తులు పొడ చూపుతున్నాయి.

పంటకాలువ ఆక్రమణ



సరిపల్లి రహదారిని ఆనుకుని పంటకాలువపై నిర్మించిన వర్తక దుకాణం

ఉప్పలగుప్తం: మండలంలోని సరిపల్లి వంతెనను ఆనుకుని అమలాపురం, చల్లపల్లి ప్రధాన పంట కాలువపై యథేచ్ఛగా ఆక్రమణలు కనిపిస్తున్నాయి. అమలాపురం నుంచి చల్లపల్లి వరకు విస్తరించి ఉన్న పంట కాలువపై ఉన్న కాలువ గట్లపై దీర్ఘకాలిక నిర్మాణాలు చేపడుతున్నారు. రోడ్లను, కాలువలను ఆనుకుని వర్తక దుకాణాలు చేపట్టడంతో రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులకు, చెత్త చెదారం కాలువలో పడవేయటంతో కాలువ ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

వాహనాల వేలం ద్వారా రూ.79 వేల ఆదాయం

తాళ్లరేవు: వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సంబంధించి నిర్వహించిన వేలంలో రూ.79,332 మేర ఆదాయం వచ్చినట్లు తాళ్లరేవు ఎస్‌ఈబీ ఎస్సై టి.చిట్టిబాబు తెలిపారు. డిప్యూటీ కమిషనర్, అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు ఎస్‌ఈబీ అసిస్టెంట్ సూపరెంటెండెంట్ ఎ.శ్రీరంగం దొర ఆధ్వర్యంలో 9 వాహనాలు వేలం వేయగా 5 వాహనాలను రూ.59,400కు పాడుకున్నట్లు తెలిపారు. జీఎస్టీతో కలిపి రూ.79,332 ఆదాయం రాగా ప్రభుత్వ ఖాతాకు జమ చేసినట్లు చిట్టిబాబు తెలిపారు.

ఉపాధ్యాయ సంఘాల మధ్య కోల్డ్ వార్

కాట్రేనికోన: మండల పరిషత్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘానికి చెందిన జెండా దిమ్మ విషయంలో ఉపాధ్యాయ సంఘాల మధ్య కోల్డ్ వార్ నడుస్తుంది. మండల పరిషత్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ సంఘ జెండా దిమ్మ నిర్మాణానికి అధికారులు అనుమతులు ఇవ్వడంతో జెండా దిమ్మ నిర్మాణం చేపట్టారు. ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం సభ్యులు జెండా దిమ్మ ఏర్పాటుకు అనుమతులు నిరాకరించడంతో ఉపాధ్యాయ సంఘాల మధ్య కోల్డ్ వార్ నడుస్తుంది. ఎవరు అడ్డు చెప్పినా సరే కచ్చితంగా జెండా దిమ్మను నిర్మించి తీరుతామని ఒక వర్గం చెబుతుంది.

ఢిల్లీ వెళ్లకుండా నిధులు ఎలా సాధ్యం?

యానాం: పుదుచ్చేరి అభివృద్ధికి సీఎం రంగసామి కేంద్రంలో ఎవరిని సంప్రదించకుండా నిధులు ఏ విధంగా సాధిస్తారని మాజీ సీఎం నారాయణసామి విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రంగసామి ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రిని కలవరని, అదేవిధంగా నీతిఅయోగ్ వంటి అత్యున్నత సమావేశాలకు హాజరు కారని ఈ విధంగా వ్యవహరిస్తే రాష్ట్రానికి నిధులు ఏ విధంగా లభిస్తాయని ఆయన ప్రశ్నించారు. గతం కంటే ఈ ఏడాది కేంద్రం పుదుచ్చేరికి ఇచ్చే నిధుల్లో రూ.300 కోట్లు కోత విధించిందని విమర్శించారు. ఇండియా కూటమి పార్లమెంట్ సభ్యులు పుదుచ్చేరి స్టేట్‌హుడ్‌కు మద్దతుగా నిలుస్తుందన్నారు. కేంద్రం వక్ఫ్‌బోర్డు యాక్ట్‌ను రూపొందించడం మతస్వేచ్ఛకు భంగం కలగజేయడమేనని విమర్శించారు.

ముత్యాలమ్మకు వెండి ఊయల సమర్పణ



పి.మల్లవరం ముత్యాలమ్మ అమ్మవారికి వెండి ఊయల సమర్పిస్తున్న జానకీరామ్, రమ్య దంపతులు

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి యానాంకు చెందిన సలాది జానకిరామ్, రమ్య దంపతులు నాలుగు కిలోల వెండి ఊయలను సమర్పించారు. ఆదివారం ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. దాత జానకిరామ్ మాట్లాడుతూ తమకు కుమారుడు జన్మించినప్పుడు నాలుగు కిలోల బరువు ఉండటంతో ఆ మేరకు అమ్మవారికి ఊయల సమర్పిస్తామని మొక్కుకున్నామని, ఆ మొక్కును చెల్లించుకున్నట్లు తెలిపారు. జానకిరామ్ తల్లిదండ్రులు యేసు, వెంకటేశ్వరరావు, సోదరుడు లక్ష్మణ్ సందీప్, బంధువులు విళ్ల వీర, సత్యనారాయణ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జానకిరామ్, రమ్య దంపతులు వస్త్రదానం, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉంగరాల వెంకటేశ్వరరావు, పంపన విష్ణు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు మౌలిక సౌకర్యాల కల్పన

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నూతనంగా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి కావాల్సిన అన్ని మౌలిక సౌకర్యాలును కల్పిస్తామని సీఎం రంగసామి హామీ ఇచ్చారు. ఆదివారం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) రీజినల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరి వ్యాప్తంగా ప్రతి ఏడాది అధికసంఖ్యలో మెడికల్, ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారని అయితే వారికి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. పుదుచ్చేరి చిన్న రాష్ట్రమే కానీ విద్యారంగంలో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. ఆ విధంగా ఉపాధి అనేది కష్టంగా మారిందన్నారు. చదువుకున్న యువతను విదేశాల్లో పని కోసం వెళ్లమని పుదుచ్చేరి ప్రోత్సహించదన్నారు. అయితే పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు ఉపాధి కల్పించాలన్నదే తమ ధ్యేయమన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తే వారికి పన్నుల్లో రాయితీలు కల్పిస్తామని అనుమతులు కూడా త్వరగా ఇస్తామన్నారు. ప్రస్తుతం పన్ను రాయితీ లేకపోవడంతో పలు పరిశ్రమలు పక్కనున్న తమిళనాడుకు తరలిపోతున్నాయన్నారు. సితార్‌పేట, కరసూర్ వద్ద 750 ఎకరాలతో ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ స్థాపనకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో సీఐఐ సౌత్‌జోన్ అధ్యక్షుడు నందిని, ఉపాధ్యక్షుడు థామస్‌జాన్ ముత్తుట్, జోనల్ డైరెక్టర్ జయేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం సొమ్ములు చెల్లించాలి

అమలాపురం టౌన్: జిల్లాలోని రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం నేటి వరకూ సొమ్ములు చెల్లించలేదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు గత పంటకు పెట్టుబడులు పెట్టేసి.. ఇప్పుడు మలి పంటకు అప్పుటు చేసి సాగు చేసుకుంటున్న దృష్ట్యా తక్షణమే రైతులకు ధాన్యం బకాయి సొమ్ములు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అమలాపురంలో ప్రభాకరరావు ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకూ ధాన్యం సొమ్ములు రైతులకు జమ చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. రైతులు ఆరుగాలం కష్టించి సాగు చేసి పండించిన పంటకే సొమ్ములు చెల్లించపోతే రైతులకు ఈ ప్రభుత్వం ఇంకేమి మేలు చేస్తుందని ప్రశ్నించారు. రైతులకు వారికి కష్టానికి తగ్గ ఆదాయాన్ని కూడా ప్రభుత్వం ఇచ్చే విషయంలో ఇలా జాప్యం చేయడం తగదని ప్రభాకరావు చెప్పారు. అప్పుల పాలైన అన్నదాతలను తక్షణమే ఆదుకునేందుకు వారికి ఇవ్వాల్సిన సొమ్ములను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

సూర్యారావు మృతికి సంతాపం



కొల్లి సూర్యారావు చిత్రటానికి నివాళి లర్పిస్తున్న దండోరా నాయకులు

అమలాపురం రూరల్: బీజేపీ సీనియర్ నాయకుడు కొల్లి సూర్యారావు మృతికి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వెల్ఫేర్ సొసైటీ సమావేశం సంతాపం తెలిపింది. ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు అధ్యక్షతన నడిపూడిలో జగ్జీవన్‌రామ్ సామాజిక భవనంలో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. సూర్యారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్యారావు వర్గీకరణ ఉద్యమం, బీజేపీ పార్టీకి ఎనలేని కృషి చేశారని ప్రగాఢ సంతాపం తెలిపారు. నాయకులు కాపా నాగభూషణం, తొత్తరమూడి ప్రభాకరరావు, చాట్ల సత్యనారాయణ, మందా వెంకటేశ్వరరావు, ఈతకోట రాజు, కొడమంచిలి సాయికుమార్, నేదునూరి వెంకట్రావు, కుందుర్తి సత్యనారాయణ, తొత్తరమూడి సాయిబాబు, యార్లగడ్డ వెంకట్రావు, కొడమంచిలి కృష్ణ, నేదునూరి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మాజీ ఎంపీ ఎం.హర్షకుమార్, జై భీమ్ భారత పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ వ్యతిరేకించడం చాలా దురదృష్టకరమని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు అన్నారు. సుప్రీంకోర్టు వర్గీకరణపై మాదిగలకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. మాదిగలకు రిజర్వేషన్లలో ఉద్యోగాలు అన్యాయం జరుగుతుందని మాల నాయకులు ఆలోచించరా అని ప్రశ్నించారు.

దళిత సంఘాల కొవ్వొత్తుల ర్యాలీ



కాట్రేనికోనలో అంబేడ్కర్ స్మృతి వనంపై దాడికి నిరసనగా దళిత సంఘాల కొవ్వొత్తుల ర్యాలీ

కాట్రేనికోన: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పంపై జరిగిన దాడి రాజ్యాంగ నిర్మాతకు అవమానమని దళిత సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. అంబేడ్కర్ స్మృతి వనంపై జరిగిన దాడికి నిరసనగా కాట్రేనికోన గేట్ సెంటరులో దళిత సంఘాలు, వైఎస్సార్ సీపీ నాయకులు సంయుక్తంగా కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. దాడికి పాల్పడిన దోషులను ప్రభుత్వం తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజల గుండెల్లో నిలిచిన నాయకులు విగ్రహాలు, శిలాఫలకాలు ధ్వంసం చేయడం దుర దృష్టకరమన్నారు. రాక్షస రాజ్యం ఆంధ్రప్రదేశ్‌లో నడుస్తోందన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, అక్క శిరామ కృష్ణ, దళిత నాయకులు కాశిహనుమంతరావు, నందిక శ్రీను, గిడ్ల శ్రీనివాసరావు, గంటి శ్రీధర్, బి శ్రీను ఉన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



ఈదరపల్లిలో దంతవైద్య శిబిరం వైద్యులతో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు

అమలాపురం రూరల్: అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఈదరపల్లి పంచాయతీ వద్ద విష్ణు దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా దంతవైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ దివ్య శిబిరంలో 345 మందికి దంత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అమలాపురం పట్టణ పరిధిలో అనేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సర్పంచ్ రాయుడు వరలక్ష్మి, వైస్ ఎంపీపీ అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎంపీటీసీ అడపా సత్తిబాబు, కర్రి సత్యనారాయణ, లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ మల్లి బాబు, కార్యదర్శి మద్దెల వెంకటేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, చిక్కాల సతీష్, వెంకటరమణ, సగ్గు గోపి, యల్లమిల్లి నాగ సుధా కొండ, కాశి రాంబోది, ములపర్తి సత్యనారాయణ, ఉండ్రు శ్యామలరావు, గోసంగి సత్యనారాయణ, కర్నిడి ప్రభ పాల్గొన్నారు.

గుండెపోటుకు గురైన వ్యక్తిని కాపాడిన సీహెచ్‌సీ వైద్యులు



గుండెపోటుకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న సుధాకర్‌కి చికిత్స అందిస్తున్న డాక్టర్ పృథ్వీరాజ్, సిబ్బంది

అల్లవరం: గుండెపోటుతో ప్రాణాపాయ స్థితికి చేరిన వ్యక్తిని అల్లవరం సీహెచ్‌సీ వైద్యులు చికిత్స చేసి కాపాడారు. రూ.40 వేల విలువ గల టెనెక్టెరల్ 40 ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడి పునర్జన్మ ఇచ్చారు. ఓడలరేవు గ్రామానికి చెందిన మధుర సుధాకర్(50) అల్లవరం సీహెచ్‌సీలో పాపకి జన్మనిచ్చి చికిత్స పొందుతున్న తన కుమార్తె ప్రమీలను చూడటానికి ఆదివారం ఉదయం 5 గంటలకు ఆసుపత్రికి వచ్చాడు. తన కుమార్తెను చూసిన తర్వాత 5.30 గంటలకు గుండెపోటుకు గురయ్యాడు. తీవ్ర ఛాతినొప్పితో బాధపడుతున్న సుధాకర్‌ని వైద్యులు పృథ్వీరాజ్ పరీక్షించి గుండెపోటుగా నిర్ధారించి ఈ విషయాన్ని డాక్టర్ లక్ష్మణరావుకు ఫోన్ చేసి వివరించారు. ఆయన వెంటనే ఆసుపత్రికి వచ్చి స్టేమీకి గురైన సుధాకర్‌కు టెనెక్టెరల్ 40 ఎంజీ ఇంజక్షన్ ఇచ్చారు. దీంతో సుధాకర్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కొంత సేపు విశ్రాంతి తర్వాత మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. స్టేమీకి గురైన రోగికి వెంటనే టెనెక్టెరల్ 40 ఎంజీ ఇంజక్షన్ ఇవ్వకపోతే ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుందని వైద్యులు లక్ష్మణరావు, పృథ్వీరాజ్ తెలిపారు. సమయానికి ఆస్పత్రిలో ఆ ఇంజక్షన్ అందుబాటులో ఉండడంతో సుధాకర్‌ను ప్రాణాలతో కాపాడామని వారు తెలిపారు.

పుదుచ్చేరి సెంట్రల్ వర్సిటీకి మూడో ర్యాంకు

యానాం: దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీల్లో పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ కొత్తగా విడుదల చేసిన అవుట్ లుక్-ఐకేర్ ఇండియా 2024లో 3వ ర్యాంకు సాధించిందని ఆదివారం యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ తరినక్కురుసు ఓ ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో విద్యారంగ పరిశోధన, పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు, ప్లేస్‌మెంట్స్, మౌలిక వసతులు, గవర్నెన్స్ అండ్ ఎక్స్‌టెన్షన్ అండ్ డైవర్సిటీ అవుట్ రీచ్ అంశాల్లో 1000 పాయింట్లకు గాను యూనివర్సిటీ 910.11 స్కోర్‌ను సాధించిందన్నారు. గతంలో ఉన్న నాల్గో ర్యాంకు నుంచి మూడో స్థానానికి చేరుకుందన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీ విజేతలు వీరే...

మలికిపురం: స్థానిక శ్రీరామ బ్యాడ్మింటన్ అకాడమీ సౌజన్యంతో ఫ్రెండ్స్ షటిల్ క్లబ్ ఆధ్వర్యంలో మలికిపురం డిగ్రీ కాలేజ్ ఇండోర్ స్టేడియంలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన షటిల్ టోర్నమెంట్ గత రెండు రోజులుగా జరుగుతున్నాయి. వివిధ టీంలు తలపడగా ఆదివారంతో పోటీలు ముగిశాయి. టోర్నమెంట్‌లో సీనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా పెద్దిరాజు, అండ్ బాలు టీం రన్నర్స్‌గా పి.కృష్ణచైతన్య-బి.వీరబాబు టీంలు నిలిచాయి. జూనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా ఎస్.విశాల్ రాజు-వై.నాగబాబు టీం, రన్నర్స్‌గా ఆర్.వేణు-బి.ప్రశాంత్‌లు గెలుపొందారు. ఈ టోర్నమెంట్‌కి చీఫ్ రిఫరీ మహ్మద్ జానీ ఇంతాల్, కోచ్ కె.హరికృష్ణ వ్యవహరించగా క్రీడాకారులను దెందుకూరి రాంబాబురాజు, ప్రముఖ షటిల్ క్రీడాకారుడు పెదపాటి జాన్ విలియమ్స్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్లబ్ సభ్యులు గెద్దాడ నాగేశ్వరరావు, కృష్ణ చైతన్యమణి, నేతికొండ అంజి, నల్లి శివకుమార్, పెదబాబు, సద్గుణ్ సాయిరాం, పవన్, చందు, స్టాలిన్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

అమలాపురం టౌన్: అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలోని జార్జి కార్నేషన్ క్లబ్‌ను తెరిచి పేకాట ఆడుతున్న బృందంపై పట్టణ పోలీసులు చేసిన మెరుపు దాడిలో 21 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.48,500 నగదు సీజ్ చేశారు. పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం సాయంత్రం ఆ క్లబ్‌పై దాడి చేసిన సంగతి తెలిసిందే. శనివారం రాత్రి పొద్దుపోయాక 21 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విషయంలో రాజకీయ ఒత్తిళ్లు ఎదురైనా పోలీసులు కేసులు నమోదు చేసి 21 మందిని అరెస్ట్ చేశారు.